క్లుప్తంగా

14న గౌలిదొడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సంజీవనీ ఆంజనేయ సహిత వైకుంఠ సీతారామ నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పునర్వసు మాస తిరునక్షత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మూలమూర్తులకు నవకలశ స్నపనం(అభిషేకం), 10 గంటలకు సంక్షేప రామాయణ హోమం, మన్యుసూక్త హోమం, శ్రీరామ మూల మంత్ర హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు

శ్రమదానంతో మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌ఆర్30 ఎక్స్‌టేషన్ రేడియల్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఆదివారం గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు శ్రమదానంతో మరమ్మతులు చేశారు. అనంతరం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. పదేళ్లుగా ఆర్‌ఆర్30 ఎక్స్‌టేషన్ రోడ్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి చేరడంతో పాటు గుంతల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదని వాపోయారు. ఇప్పటికే ప్రమాదాల్లో వందలాది మంది మృతి చెందారని తెలిపారు. తమ బాధను పాలకులకు తెలపాలన్న ఉద్దేశంతో తమే శ్రమదానంతో మరమ్మతులు చేస్తున్నామని వివరించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి



అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట హైదరాబాద్ జాతీయ సేవా పథకం చైర్మన్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి ఆధ్వర్యంలో వాలంటీర్లు ఆదివారం పటాన్‌చెరు మండలం ఐనోల్, పెద్ద కంజర్ల గ్రామాల్లో ఈ సేవా, స్వచ్ఛతా మీ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీని నిర్వహించి ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మూసాపేట: కూకట్‌పల్లిలోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.97,370 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని లక్ష్మీ హాస్టల్‌లోని పెంట్ హౌస్‌లో జగద్గిరిగుట్ట, ఎర్రగడ్డ, బేగంపేట, జూబ్లీహిల్స్, బషీర్‌బాగ్, కూకట్‌పల్లి ప్రాంతాలకు చెందిన పలువురు పేకాడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ కె.వి. సుబ్బారావు పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు సమక్షంలో బృందం శనివారం రాత్రి 11 గంటలకు పేకాట స్థావరంపై దాడి చేసింది. వారి నుంచి 97,370 నగదు, 7 మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పాండు రంగస్వామి పల్లకీ సేవ

మూసాపేట: జనతానగర్‌లోని పాండు రంగస్వామి ఆలయంలో ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మూసాపేటలో నివాసముంటున్న మరాఠీలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఉమాకాంత్, విశ్వనాథ్, కిషన్‌రావు, నర్సింగ్‌రావు, గోపాల్‌రావు, ఖండేరావ్ తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ ఐఐటీ,ఎన్ఐటీ

గౌలిదొడ్డి బాలుర గురుకులంలో హైస్కూల్ తరగతులు

- 8వ తరగతి నుంచే ఐఐటీ, నీట్ ఫౌండేషన్ శిక్షణ
- 8,9,10 తరగతుల ఏర్పాటు
- ఒక్కో తరగతిలో 80 మంది విద్యార్థులు
- 240 మంది విద్యార్థులకు అవకాశం
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరిన్ని ఎంబీబీఎస్, ఐఐటీ, ఎన్ఐటీ సీట్ల సాధనే లక్ష్యం
- కళాశాలకు ఐఐటీ ఫౌండేషన్ సీఓఈగా గుర్తింపు



గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల

రాయదుర్గం: గ్రామీణ పేదింటి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో అత్యాధునిక శిక్షణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదటి నుంచి కళాశాలగానే దీనిని కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో అత్యధికంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఐఐటీ, ఎన్ఐటీ సీట్లు సాధించే కళాశాలగా దీనికి గుర్తింపు ఉంది. దీంతో ఈ కళాశాలలో హైస్కూల్‌ను కూడా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మరిన్ని సీట్లు సాధించే అవకాశం ఉంటుందనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ తీసుకున్న నిర్ణయంతో హైస్కూల్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ కాలేజీని ఐఐటీ ఫౌండేషన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)గా కూడా గుర్తించి మరింత బ బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఈ విద్యా సంవత్సరం నుంచే..

గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల మొదటి నుంచి కేవలం ఇంటర్మీడియట్ కళాశాలగానే కొనసాగుతూ వచ్చింది. అయితే ఈ విద్యాసంత్సరం నుంచి హైస్కూల్ కూడా అందుబాటు లోకి వచ్చింది.

- ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ కళాశాలలో కొత్తగా 8,9,10 తరగతులను కూడా ఏర్పాటు చేశారు. ఒక్కో తరగతిలో 80 మంది విద్యార్థుల చొప్పున 240 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ కళాశాలకు ఫౌండేషన్ సీఓఈగా గుర్తింపు లభించింది.
- హైస్కూల్ ఏర్పాటుతో అవసరమైన మేరకు టీచర్లను నియమించి విద్యాబోధనను ప్రారంభించారు.

ఐఐటీ, నీట్‌లో మరిన్ని సీట్లు..

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం, సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యా సంస్థ ఆదేశాల మేరకు గౌలిదొడ్డి కళాశాల/పాఠశాలలో ఐఐటీ, నీట్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

- హైస్కూల్ స్థాయి పాఠ్యాంశాలను టీచర్లు బోధిస్తారు. లెక్చరర్లతో నీట్, ఐఐటీ సీట్ల సాధనకు అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.
- 8వ తరగతి నుంచే ఐఐటీ, నీట్‌లో శిక్షణ ఇవ్వడంతో హైస్కూల్‌లో మూడేళ్లు, ఇంటర్మీడియట్ స్థాయిలో మరో రెండేళ్ల పాటు శిక్షణ పొందే అవకాశం ఉండటంతో మరిన్ని ఎంబీబీఎస్, ఎన్ఐటీ, ఐఐటీ సీట్లు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందనే అభిప్రాయంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం విశేషం.

పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు..



రాష్ట్రంలో పేద వర్గాలకు చెందిన విద్యార్థులే ఇందులో చదువుకుంటున్నారు. వారికి మంచి భవిష్యత్తును అందించేలా, ఉన్నత విద్యలో వారిని ప్రోత్సహించేలా చేస్తున్నాం. రాష్ట్రంలో అత్యధిక ఎంబీబీఎస్, ఐఐటీ, ఎన్ఐటీ సీట్ల సాధనే లక్ష్యం. ప్రస్తుత నిర్ణయంతో 8వ తరగతి నుంచే నీట్,ఐఐటీలో శిక్షణ ఇస్తుండడంతో మరిన్ని సీట్లు సాధించి అత్యధిక సీట్లు సాధించే కళాశాలగా స్థిరంగా స్థానం ఉండేలా చేయాలన్నదే సమష్టి లక్ష్యంగా పెట్టుకున్నాం. అందు కోసం అవసరమైన మేరకు చదువుతో పాటు, ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశంపై ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు సమష్టిగా లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారు.

– అంజయ్య-ప్రిన్సిపాల్- గౌలిదొడ్డి సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల/పాఠశాల

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్

మియాపూర్: ప్రతి ఒక్కరు సేవ దృక్పథాన్ని అలవర్చుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. మియాపూర్ డివిజన్ ప్రగతి ఎన్ క్లౌ పార్కులో ఒడిశాకు చెందిన వీరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్కల్ సేవా సమితి 6వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి ప్రాంతంలో ఒడిశా ప్రాంతం నుండి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారికి భారతీయ జనతా పార్టీ తరపున ఎల్లప్పుడూ సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నాగులుగౌడ్, మాణిక్ రావు, రాధాకృష్ణ యాదవ్, మహేష్ , లక్ష్మణ్ ముదిరాజ్, శ్రీనివాస్, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్, గోపి, వీరేందర్ పాల్గొన్నారు.

ముగిసిన టూరిజం పోలీసుల శిక్షణ



యాదగిరిగుట్టలో టూరిజం పోలీసులు, నిథమ్ అధికారులు

రాయదుర్గం: టూరిజం పోలీసు విభాగానికి ఎంపికైన పోలీసులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ఆదివారం ముగిసింది. 80 మంది టూరిజం పోలీసులకు గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్‌లో శిక్షణ ఇచ్చారు. గత రెండు రోజులుగా ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలలో పర్యటనలు నిర్వహించి వాటి ప్రాధాన్యతను వివరించి అక్కడ విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. యాదగిరిగుట్ట, భువనగిరికోట, కొలనుపాక, గోల్కొండ, సెవెన్ టూంబ్స్, లుంబినిపార్కు, హుస్సేన్‌సాగర్ లేక్ బోటింగ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వాటి ప్రాధాన్యత, విధుల నిర్వహణపై నిథమ్ ఫ్యాకల్టీలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిథమ్ అధికారులు మాట్లాడుతూ టూరిజం పోలీసు విభాగం ఏర్పాటు చేయడం రాష్ట్రంలో మొదటిసారిగా నియామకాలు చేపట్టారన్నారు. మొదటి విడతలో 80 మందికి శిక్షణ ఇచ్చే అవకాశం నిథమ్‌కు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



గోల్కొండకోటలో..

అన్ని వర్గాలవారు బీజేపీ వైపు చూస్తున్నారు



బీజేపీలో చేరిన వారితో రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: అన్ని వర్గాల వారు బీజేపీ వైపు చూస్తున్నారని శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో మాదాపూర్ బీజేపీ ఇన్‌చార్జి గంగల రాధాకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ వారికి కండువాలను కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు విద్యావంతులు, ప్రొఫెసర్లు, ఇతర వర్గాలవారు బీజేపీలో చేరేందుకు ముందుకొస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వారికి సంపూర్ణ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రశాంత్‌గౌడ్, విద్యాధర్‌రెడ్డి, చందన్, నిఖిల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ

శేరిలింగంపల్లి: మత సామరస్యానికి గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు ప్రతీక అని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. ఆదివారం నెహ్రూనగర్‌లో గ్యార్వీ షరీఫ్ ముబారక్ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సామరస్యంగా జరుపుకునే వేడుక న్నారు. ఈ ఏడాది నిర్వహించే గ్యార్వీ ఉత్సవం జాతరను తలపిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు గఫార్, యాదాగౌడ్, రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, గోపాల్‌యాదవ్, రవియాదవ్, ఖాదర్‌ఖాన్, తాహెర్, అజీజ్, షాదిక్, మహబూబ్, అలీమ్, ఖలీల్, అలీ, రజాక్, మీర్‌అలీ, నర్సింహ్మా, సైదులు, సత్యనారాయణ, దస్తగిరి, జగదీష్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

ఆల్విన్‌కాలనీ: నూతనంగా ఏర్పడిన హైదర్‌నగర్ డివిజన్ మిత్రాహిల్స్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, బృందం బొల్లెపల్లి సీతారామ రాజు, బాలాజీ తదితరులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. రానున్న జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, రమేశ్, కరుణాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్, హోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



వలంటీర్లకు భోజన ప్యాకెట్లను అందిస్తున్న స్టేట్ బ్యాంక్ ఏజీఎం మర్రి భాస్కర్ తదితరులు

శేరిలింగంపల్లి: లయన్స్‌క్లబ్, హోప్‌ఫౌండేషన్ సేవలు అభినందనీయమని స్టేట్‌బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మర్రి భాస్కర్ అన్నారు. ఆదివారం పల్స్ పోలియో వాలంటీర్లకు లయన్స్‌క్లబ్, హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనాలు అందజేశారు. శేరిలింగంపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో 700 మంది వలంటీర్లకు భోజనాలు సిద్ధం చేయగా వాటిని ఆయన స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్‌పోలియో కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని ఇందులో పాల్గొని విజయవంతం చేయడంలో కృషి చేసిన వారు అభినందనీయులన్నారు. హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొండ విజయ్‌కుమార్ నాయకత్వంలో లయన్స్‌క్లబ్. హోప్ ఫౌండేషన్ సభ్యులు మల్లేష్‌యాదవ్, ప్రసాద్, రాజశేఖర్, వడ్ల విష్ణుమూర్తి, పీటర్ పాల్గొన్నారు.

ఆ కుటుంబాల మనశ్శాంతి కోసం పనిచేస్తున్నాం



సాక్షి, సిటీబ్యూరో: ప్రతి వ్యక్తికి తన చివరి దశలో జీవన విధానం, ఆరోగ్య సంరక్షణపై సొంత నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంటుందని స్పర్శ్ హాస్పిస్ ఫౌండర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. వరల్డ్ హాస్పిస్, ప్యాలియేటివ్ కేర్ డే సందర్భంగా ఖాజాగూడలో లివింగ్ విల్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఎక్కడున్నా తల్లిదండ్రులను బాధ్యతతో చూసుకోవడం, వైద్య సేవలపై స్పష్టత ఇవ్వడం వంటి అంశాలు కుటుంబాలకు మనశ్శాంతినిస్తాయన్నారు. వయోవృద్ధుల ఆకాంక్షలకు అనుగుణంగా, చట్టబద్ధంగా తమ సిబ్బంది నడుచుకుంటారని తెలిపారు. ఈ కేంద్రం దక్షిణ భారత దేశంలోనే మొదటి అడ్వాన్స్ కేర్ లివింగ్ ప్లాన్ కేంద్రంగా నిలుస్తుందన్నారు. గత 14 ఏళ్లలో 14 వేల మంది వృద్ధులకు చివరి దశ సేవలందించామన్నారు. ఆరోగ్య శాఖతో సంయుక్తంగా కమ్యూనిటీ ఔట్ రీచ్, కేర్ గివర్ సపోర్టు, ప్రొఫెషనల్ ట్రైనింగ్ కార్యక్రమాలతో పాటు వర్క్‌షాపులు, అడ్వాన్స్ కేర్ ప్లానింగ్‌ను ప్రామాణిక వైద్య విధానాల్లో చేర్చే ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ ట్రస్టీ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయిద్దాం.. మహమ్మారిని తరిమేద్దాం..



పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి మహమ్మారిని తరిమేయాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని జయప్రకాశ్ నారాయణ నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రెండు పోలియో చుక్కలతో చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని చిన్నారులకు పోలియో రహిత భవిష్యత్తును అందిద్దామన్నారు. డివిజన్‌లోనితల్లిదండ్రులు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మోహన్ రావు, శివ ముదిరాజ్ , మహేశ్వర్ రెడ్డి, బసవేశ్వర్, ఆశావర్కర్ సుజాత, సపోర్టింగ్ స్టాఫ్స్ అక్తర్ బేగం, సతీష్, ఈశ్వర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



మియాపూర్: కళాకారుల భరతనాట్య ప్రదర్శన అలరించింది. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం రాగసుధ డాన్స్ అకాడమీ అనురాధ శిష్య బృందం ఆదివారం భరతనాట్య ప్రదర్శన చేశారు. ఆనంద నర్తన గణపతి, పుష్పాంజలి శివస్తుతి , గణపతి కౌతం, మహా గణపతిమ్, జావళి, తిల్లాన, శ్రీమన్నారాయణ, దుర్గాదేవి, అలరిపు, భో శంభో, మహాలక్ష్మీకౌతం, సరస్వతీ స్తుతి, మూషిక వాహన, తదితర అంశాలను కళాకారులు సహస్ర అద్వైత, శాన్విక, హంసిక, ఆర్య, నక్షత్ర, ప్రీతి, రాగ, సౌజన్య, అనన్య, భాగ్య, శాన్వి, స్వాతి, మనస్విని తదితరులు ప్రదర్శించి అలరించారు.



పల్స్‌పోలియో విజయవంతం



హఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గాంధీ



గోపన్‌పల్లి బస్తీదవాఖానాలో ..

శేరిలింగంపల్లిజోన్‌బృందం: పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఆదివారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. హఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు పోలియో చుక్కలు వేశారు. వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వాలంటీర్లు పాల్గొని సేవలను అందించారు. సందర్భంగా ఎమ్మెల్యే వైద్య బృందాన్ని, వలంటీర్లను అభినందించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి , వైద్యశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.



లింగంపల్లిలో..



రాయదుర్గం పీహెచ్‌సీలో ..